# సానుభూతి

*(12-8-2006, "ఆంధ్రభూమి" దినపత్రిక)*

కష్టాలు భరించగలమేమోగానీ సానుభూతి భరించలేం..... తాతయ్య బతికుండగా అన్న ఆ మాటలు ఇప్పుడు బాగా అనుభవంలో కొచ్చాయి సునీతకి.. పక్క వాటాలో ఉండే సావిత్రమ్మే దానికి మూలకారణం. సునీత భర్త ఈమధ్య స్కూటర్ ప్రమాదంలో పోయాడు. ప్రభుత్వోద్యోగం చేసేవాడు. సునీత కూడా పెళ్ళికి ముందునించీ ఉద్యోగం చేస్తోంది ఓ ప్రైవేట్ కంపెనీలో. ఇద్దరాడపిల్లలు.. ఎనిమిదో తరగతి, ఆరో తరగతి చదువుతున్నారు. వాళ్ళకి చదువులు చెప్పించాలి పెళ్ళిళ్ళు చెయ్యాలి. మెల్లిగా రొటీన్లో పడక తప్పదు... ఎన్నాళ్లని ఆఫీసులో సెలవిస్తారు? ఉద్యోగం ఊడిందంటే ఉన్న ఒక్క ఆధారమూ పోయినట్టే. పిల్లలిద్దరూ స్కూల్‌కెళ్ళగానే తనూ బయల్దేరింది లంచ్ బాక్స్ తీసుకుని.

"సూల్‌కెళ్ళిపోయారా పిల్లలు?" లోపలికడుగు పెట్టింది సావిత్రమ్మ.

తన ఇంట్లో పన్లు తను చూసుకోక అవి పక్కకి పెట్టి ఇరుగు పొరుగు ఇళ్ళల్లో వార్తలు సేకరించుకోడానికి పొద్దుట్నించీ కాళ్ళకి చక్రాలు కట్టుకుని బయల్దేరుతుంటుందావిడ.

"పిల్లలు వెళ్ళారు పిన్నిగారూ..."

"నువ్వూ ఎక్కడికో బయల్దేరినట్టున్నావే? పైనించి కిందకి ఆవిడ చూసిన చూపు చాలా అసహ్యంగాతోచింది సునీతకి.

"ఆఫీసుకెళ్తున్నా పిన్నిగారూ" ఏదో తప్పు చేసి సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు ఇదేం ఖర్మతనకి.

"ఇంకా ఉద్యోగం చేస్తావా?"

ఇదేం ప్రశ్న? జవాబు కూడా చెప్పాలనించలేదు.

"పాపం... రోజు గడవాలంటే నువ్వుద్యోగం మానడానికి లేదు. కదా? కానీ... ఇన్నాళ్ళూ ఓ రకంగా వెళ్ళావు... ఇంకిప్పుడు... సుమంగళిగా వెళ్ళడానికి లేదు కదా... జాలేస్తోంది నిన్ను చూస్తే..."

ఆ జాలి ఓదార్పులా లేకపోవడం సరికదా ముళ్ళు గుచ్చినట్టుంది సునీతకి.

గట్టిగా అరవాలనిపించింది.. మీ సానుభూతి నాకొద్దు.. మీ సానుభూతి నా కొద్దు నన్ను బతకనివ్వండి.. నన్ను మనుషుల్లో పడనివ్వండి...

"మర్చిపోయినట్టున్నావు సునీతా.. ఇదివరకులా బొట్టు పెట్టేసుకుని వెళ్ళిపోతు న్నావు. లోకం మెచ్చదు"

"నాకీ బొట్టు ఆయన్తో వచ్చింది కాదు కదండీ నేను పుట్టినప్పట్నించీ పెట్టుకుంటున్నదే. ఇందులో కొత్తేముందీ? ఎందుకలాంటి మాటలు?"

సరిగ్గా అప్పుడే ఎదురింటి లత కిందటి రోజు తీసుకున్న పెన్ను తిరిగి ఇచ్చెయ్యడానికొచ్చింది.

"రా...లతా.. పాపం బొట్టు పెట్టుకోవాలన్న కోరికుంటుంది కదా సునీతకి. పెట్టుకోమంటున్నాను...."

తెల్లబోయింది సునీత.. ఛీ...ఛీ... మనసులో అక్కసు... పైకి వక్రంగా మాటలు.. ఏం మనిషో? చదువు ఉన్నా లేకపోయినా సంస్కారమైనా ఉండాలి మనిషికి.. రెండూ లేవు ఈవిడకి...

ఓ పక్క ఆఫీసుకి టైమవుతుంటే ఈవిడ గోలేమిటో తనకి?

ఆవిడ వెళ్ళిపోయాక ఇల్లు తాళం పెడుతూ చిన్నగా నిట్టూర్చింది.

"ఈ సావిత్రమ్మతో చాలా విషయాల్లో ఇబ్బంది కరంగానూ మనసుకి బాధగానూ ఉంటోంది లతా"

"ఇరుగుపొరుగు అందరికీ ఆవిడతో ఇబ్బందికరం గానే ఉంటోంది. అందరి విషయాల్లో తలదూరుస్తోంది. భర్త బతికున్న రోజుల్లో ఆవిడ సుఖపడలేదుట.. అందుకని తన కోడలు సంతోషంగా కాపరం చేసుకోవడం చూడలేక కొడుక్కి కోడులికి మధ్యన పుల్లలు పెడుతూ వాళ్ళు సఖ్యతగా లేకుండా చేస్తూ ఉంటుంది. పైకి మాత్రం కపట సానుభూతి కబుర్లు ఎన్నయినా చెప్తుంది.

"మా ఇంటి గుమ్మంలో ఎవరివైనా చెప్పులు కనబడినా లేదా ఎవరైనా రావడం చూసినా.. ఏదో వంక పెట్టుకుని లోపలికి దూసుకొచ్చేస్తుంది.. ఎవరొచ్చారో ఎందుకొచ్చారో అన్నీ ఆవిడకే కావాలి."

"అది మరీ టూమచ్ కదా? నిజంగా ఏదన్నా అవసరం పడినా కూడా మనం అయితే వాళ్ళింట్లో ఎవరో ఉన్నారు.. వాళ్ళు వెళ్ళిపోయాక వెళ్దాంలే అని ఆగుతాం" వెంటనే అంది లత.

"సరే మరి నేనొస్తాను" చకచకా బస్‌స్టాప్ వైపు నడిచింది సునీత.

★ ★ ★

"ఇలారా"

బయట మెట్లమీద కూచుని తన స్నేహితురాలితో కబుర్లు చెప్తున్న సునీత చిన్నకూతుర్ని చెయ్యూపి పిల్చింది సావిత్రమ్మ.

ఆ పిల్ల దగ్గిరగా రాగానే మెల్లిగా గొంతు తగ్గించి అడిగింది "ఎవరో వొచ్చెళ్ళినట్టున్నారు మీ ఇంటికి? ఎవరాయన? మా చుట్టాలావిడొకత్తి వచ్చి కూచోడంతో ఆవిడెళ్ళేదాకా బయటికి రావడానికవలేధు నాకు. నేను చూసేప్పటికి మీ ఇంటికొచ్చినాయన వెళ్ళిపోతున్నాడు"

"శివరావు అంకుల్ వచ్చాడు"

ఆవిడ అలా ఆరాలు తియ్యడం ఏవిటో ఆ వరసేవిటో తెలియని పిల్ల అది.

"ఎందుకొచ్చాడు?"

"పెళ్ళిచేసుకుంటానని చెప్పడానికొచ్చాడు"

"అ..." బుగ్గలు నొక్కుకుంది.

"ఎవర్ని చేసుకుంటాట్ట?"

"ఏమో నాకు తెలియదు మా అమ్మతో చెప్పాడు."

ఇంక ఒక్క నిమిషం కూడా ఆగలేకపోయిందా విడ.

"ఏం చేస్తున్నావమ్మా?" ఇంట్లో అడుగుపెట్టింది యోగక్షేమాలడగడాని కొచ్చినట్టు.

"ఎవరో వొచ్చెళ్ళినట్టున్నారు?"

"ఔను" చాలా మామూలుగానే జవాబిచ్చింది సునీత.

"ఎవరొచ్చినా నన్ను పిలు... నువ్వు మాట్టాడకు"

"ఏం? ఎందుకూ?"

తన బాబాయ్ కొడుకు.. అతని పెళ్ళి నిశ్చయమైందనీ నిశ్చితార్థానికి అమ్మా వాళ్ళ దగ్గరికెళ్తున్నాననీ చెప్పడానికొస్తే... ఈ తిరకాసు మాటలేవిటీ ఈవిడ? ఎవడిని పడితే వాడిని ఇంట్లోకి పిల్చి కబుర్లు చెప్తుందా తను? తిక్కవేషాలు వేసేవాళ్ళని.. తలతిక్క మాటలు మాట్లాడేవాళ్ళని ఆమడ దూరంలో ఉంచాలని తెలియని చిన్నపిల్లేం కాదుగా తను?

"ఎందుకేమిటమ్మా? మొగుడు పోయినదానివని నీ మీద పుట్టెడు జాలి నాకు. ఇరుగు పొరుగులో ఇంకెవరికన్నా నీ మీద జాలనేది ఉందా?"

నవ్వాలో ఏడవాలో తెలియలేదు సునీతకి.

ఇరుగు పొరుగు సంస్కారంతో ప్రవర్తిస్తున్నారన్న విషయం చెప్పినా ఈవిడకి అర్థంకాదేమో!

ప్రతి రోజు మొగుడు పోయినదానివి మొగుడు పోయినదానివంటూ ముల్లులా గుచ్చుతూ పుండులా సలిపే ఈ మనిషికా జాలి?.... వొద్దొద్దు.... ఈ సానుభూతి... ఈరకం జాలి నాకొద్దు.

భర్త చనిపోవడం తనకి తీరని లోటే... జీవితమంతా తనని వెన్నంటి ఉండే దుఃఖం అది.. కానీ మనసులో దిగమింగుకోవాల్సిన దుఃఖం అది... నిత్య కృత్యాలకి ఆటకం కాకూడదు. తను ధైర్యంగా నిలబడి ముందుకి సాగాలి లేకపోతే చేజేతులా పిల్లల భవిష్యత్తు పాడుచెయ్యడమే అవుతుంది. పిల్లలే జీవితం అనుకుంటూ ముందుకి సాగే తన బోటివాళ్ళకి.. ఆవిడలాంటివాళ్ళ సానుభూతి చిత్రహింసతో సమానం కాదూ?

కష్టాలు భరించవచ్చే మోగానీ సానుభూతి భరించలేం.. తాతయ్య మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చాయి.... ఆ మాటలు అక్షరసత్యాలనిపించింది.

ఆఫీసునుంచి బస్‌స్టాప్‌కి నడుస్తుంటే వెనకేవొస్తూ మెల్లిగా అన్నాడు సత్యారావు "మీతో కొంచెం మాట్లాడాలి".

సునీత ఆఫీసులోనే పన్చేస్తాడు అతనుకూడా.

"చెప్పండి"

"అబ్బే... అహ... ఇక్కడా మీ ఇంటికొచ్చి మాట్లాడతాను"

"అక్కర్లేదు ఇంటికి రానవసరంలేదు... ఇక్కడే చెప్పండి ఏమిటో?" నడుస్తూనే అంది. తల కొంచెం కూడా తిప్పలేదు.

"అయినా ఇంతసేపూ ఆఫీసులో ఉన్నాం కదా? అక్కడ మాట్లాడచ్చుగా?"

"మరేం లేదూ... అదీ అదేవిటంటే.." కాస్త తడబడిపోయాడు...

"మా ఆవిడుంది చూశారూ... పరమ గయ్యాళిది.."

ఒళ్ళు మండుకొచ్చింది సునీతకి.

తన భార్య గురించి పరాయివాళ్ళతో చెడ్డగా చెప్పే ఆ ప్రబుద్ధుడు మనిషా? పశువా? పశువుల్ని అవమానించకూడదేమో ఇలాంటివాడితో పోల్చి! ఇంత నీచమైన మనస్తత్వం ఉన్న వీడి భార్య గయ్యాళితనంతో ప్రవర్తించక మంచిగా ఎలా ఉండగలదు?

"నీకా... భర్త పోయాడు..."

హఠాత్తుగా ఏకవచన ప్రయోగం... గమనించింది...

"మా ఆవిడంటే అస్సలిష్టం లేదు నాకు.. నీ మీద చాలా సానుభూతి ఉంది... మొగ దిక్కులేని దానివయ్యావు... ఏ సాయం కావాలన్నా నన్నడుగు.. నేనే నీకు మొగదిక్కు ననుకుని నాతో చనువుగా ఉండచ్చు..."

నడుస్తున్నదల్లా చటుక్కున ఆగింది.. వీడినెందుకింకా ఈ భూమి భరిస్తోంది? మాడిమసైపోడేం వీడు? అన్నట్టున్నాయి ఆమె చూపులు.

"ఇప్పుడేకాదు ఎప్పుడూ కూడా ఇలాంటి సానుభూతి ఎవ్వరిమీదా చూపించకు. నీలాగా అందరూ చీప్ మనుషులని అనుకోవద్దు... ఒక్కటి గుర్తుపెట్టుకో.. ఎవరి సానుభూతి కోసమూ పాకులాడే మనిషి కాదు నేను. సానుభూతి అనేమాటకి విలువ ఇవ్వడం నేర్చుకో ముందు" వాడి మొహంలోకి చూడటానికి కూడా అసహ్యం అనిపించి వేగంగా బస్‌స్టాప్ చేరుకుంది.

★ ★ ★

హోమ్‌వర్కు చెయ్యకుండా... మొహం అదోలా పెట్టుకుని కూచున్న పెద్దకూతురు రమని చూసి కంగారుగా దగ్గిరకొచ్చింది సునీత.

"ఏమైందమ్మా?"

.....

"ఏమైంది తల్లీ."

.....

"చెప్పమ్మా... ఏం జరిగింది?"

"నా మనసేం బాగులేదమ్మా!"

"అయ్యో చిట్టితల్లీ.. నీ వయసెంత నీ మనసు బాగులేకపోవడానికి?"

"లేకపోతే ఏంటమ్మా?... మా సైన్సు టీచరలా ఎందుకనాలీ?"

"ఏవన్నారు తల్లీ?"

"మీ నాన్న పోయాడు కదా పాపం.. ఇంక నువ్వు చదువు మానేసి ఏదన్నా పని నేర్చుకో.. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళలా అమ్మకిసాయపడుదువు గాని.. లేక పోతే ముందు ముందు మీరు బతికేదెలా అన్నారమ్మా.... క్లాసులో పిల్లలందరూ రేపట్నుంచీ చదువు మానేస్తావా అని అడగడం మొదలెట్టారు. నాకేడుపొచ్చిందమ్మా...."

గబుక్కున కూతుర్ని అక్కున చేర్చుకుంది సునీత.

"నేనున్నాను కదమ్మా.. నువ్వూ చెల్లీ చదువు మానక్కర్లేదు.. మిమ్మల్ని పెద్దచదువులు చదివించాలని కలలు కనేవారు నాన్నగారు... మీ చదువులే నా లక్ష్యం సరేనా? మీరు కూడా పట్టుదలగా బాగా చదువుకోవాలి. ఎవరి మాటలూ పట్టించుకోవద్దు"

కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంటూ సరేనన్నట్టుగా తల ఊపింది రమ.

లేత మొగ్గల్లాంటి పిల్లల మనసులు చిదిపివేయడం సానుభూతి అనిపించు కంటుదా?

కొండలాగా ఆ ప్రశ్న సునీత కళ్ళముందు నిలిచింది.

అడుగడుక్కీ.. సానుభూతి సాలె గూట్లో తామెందుకు గిలగిలాడాలి? అడిగితే సలహాలివ్వడంలో తప్పులేదు. కానీ పరిస్థితి అలా లేదే? ఎరిగున్న ప్రతివాడూ తన కుటుంబం మీద హక్కున్నట్టు ప్రవర్తిచటం మాట్లాడటం ఏం న్యాయం?

★ ★ ★

అదివారం.. పిల్లలిద్దరికీ తలంట్లు పోసి కాస్త తీరిగ్గా టీ తాగుతూ కూచుంది సునీత... ఊళ్ళో మొదలైన ఎలక్షన్ల హడావిడి సందడి... ఆలోచన్లు అటు మళ్ళాయి. దివంగత ఎం.ఎల్.ఏ భార్యని ఎలక్షన్లో నిలబెట్టారో పార్టీవారు. సానుభూతితో ఓట్లు సంపాదించాలన్న తంత్రం.. తాపత్రయం,, అపలా ఎం.ఎల్.ఏని గుట్టుచప్పుడు కాకుండా హత్య చేయించినది ఆ సదరు పార్టీ నాయకులేనని.. అవతలి పార్టీ వారి మీద ప్రజలకి దురభిప్రాయం కలిగేలా పన్నాగం పన్నారని రహస్య సమాచార భోగట్టా.. సానుభూతితో ఓట్లు సంపాదించాలన్న దుర్బుద్ధి మనిషి ప్రాణానికి విలువనివ్వలేదు. ఆ మనిషి పేరు చెప్పి మొసలి కన్నీటితో పదవులు రాబట్టుకోవాలి. ఈ సమాజం.. ఈ దేశం ఎటు పోతున్నట్టు? ఎన్ని వినట్లేదు? ఎన్ని చూడట్లేదు?...

తాడూ బొంగరం లేనివాడు కూడా తన పబ్బంగడుపుకుందుకు సానుభూతి ఒలికిస్తే నమ్మి వెంట పడెళ్ళే ఆడపిల్లలు... ఎన్ని వినట్లేదు?...

మరొకరి సానుభూతి కోరుకునే దౌర్భాగ్యం తన పిల్లలకి పట్టకూడదు.. వాళ్ళ కాళ్ళమీద నిలబడగలిగేలా పెంచాలి వాళ్ళని.. స్థిరంగా నిర్ణయించుకుంది సునీత..

ఎవరిముందూ అప్పుకోసం చెయ్యి జాచకుండా బతికినవాడే ధనవంతుడని ఎవరి సానుభూతికోసమూ అంగలార్చకుండా తనకాళ్ళమీద తాను నిలబడ గలిగినవాడే మనిషి అనీ...

సానుభూతి అనే నాలుగక్షరాలతో ఎంతమందో ఎన్ని రకాలుగానో ఆడుకుంటు న్నారీ సమాజంలో అని తెల్సుకునేలా... అర్థం.. చేసుకునేలా వివరించి చెప్తూ పెంచాలి తన పిల్లల్ని...

ఈ ఆలోచనతో సునీత మనసు కాస్త తేలికపడింది.

★ ★ ★